క్లుప్తంగా

అడ్మిషన్లు ఆపేయడం దారుణం

తిరుపతి సిటీ: ఏపీలోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలలో 2024–25, 2025–26 విద్యా సంవత్సరాలకు సంబంధించి యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలోని అంబేడ్కర్ అధ్యయన కేంద్రం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది గ్రామీణ పేద విద్యార్థులకు, చిరు ఉద్యోగులకు ఆసరాగా ఉన్న ఉన్నత విద్యను దూరం చేయడం దారుణమని మండిపడ్డారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా చంద్రిక



చంద్రికను అభినందిస్తున్న వీసీ ఆచార్య ఉమ

తిరుపతి రూరల్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో సీఈసీ 4వ సంవత్సరం విద్యార్థిని కుంచెల చంద్రిక గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. గూగుల్ టెక్నాలజీపై స్వల్పకాలిక అవగాహన, శిక్షణా కార్యక్రమాల నిర్వహణకుగాను చంద్రికకు ఈ అవకాశం లభించింది. ఆ విద్యార్థిని ఎంపికపై వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, డైరెక్టర్ పి.మల్లికార్జున, ప్రొఫెసర్ వి.సరిత అభినందించారు.

పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

తిరుపతి అర్బన్: పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ నరసింహులుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ అమలు జరగడం లేదని వెల్లడించారు. న్యాయం చేయకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు రాము, ఎస్.జయచంద్ర, జి.చిన్న బాబు, ఎం.నాగభూషణం, రాము, కిరణ్ కుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈఓకు ఉద్యోగ సంఘం స్వాగతం


ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్‌కు స్వాగత శుభాకాంక్షలు తెలుపుతున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: టీటీడీ నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ సింఘాల్‌కు గురువారం స్థానిక పరిపాలనా భవనం వద్ద ఏపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వంకీపురం పవన్, కోశాధికారి కొప్పర్తి శివ, సభ్యులు తేజేశ్వర్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, ఈశ్వర్ నాయక్, ఉమా, భరత్, అంకయ్య, మాధవ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగరాల సర్పంచ్ జన్మదినం


జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని అగరాల గ్రామ పంచాయతీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్ఆర్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. గురువారం రాత్రి చంద్రగిరిలోని ఆయన నివాసం వద్ద నిర్వహించిన వేడుకలకు వైఎస్ఆర్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి హాజరయ్యారు. భాస్కర్ రెడ్డి, దేవారెడ్డి సోదరులను శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్ని హంగులతో ఏర్పాట్లు

చంద్రగిరి: చంద్రగిరి రాయల కోట ప్రాంగణంలో ఈనెల14, 15న నిర్వహించనున్న జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్‌కు ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయలకోటలో ఏర్పాట్లను టూరిజం, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎస్పీడీసీఎల్, పోలీస్, పురావస్తు శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. డీపీఓ సుశీలదేవి, తహసీల్దార్ శివరాం సుబ్బయ్య పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ

పాకాల: మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ డైరెక్టర్ మునస్వామి రూ.10వేల విలువైన క్రీడా దుస్తులను గురువారంహెచ్ఎం సుమతి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు మస్తాన్, రామయ్య, గణపతి, వెంకటరమణ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్ఓ వివేక్ బదిలీ

తిరుపతి మంగళం: సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖ జిల్లా పాలనాధికారిగా పనిచేస్తున్న వివేక్‌ను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నెల్లూరు రీజనల్ మేనేజర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. తిరుపతి జిల్లాకు సాయిబాబాను నియమించారు. అలాగే తిరుపతి బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్టుగా ఎం.బబితను నియమించారు.

బస్టాండ్‌లో పార్కింగ్ కష్టాలు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు దక్షిణం వైపు ప్రధాన ద్వారం మార్గంలో 300 స్కూటర్లు పార్కింగ్ చేయడానికి అవసరమైన స్థలం ఉంది. అయితే ఆ స్థలంలో స్కూటర్లు పార్కింగ్ చేయడానికి వీలులేకుండా నెల రోజులుగా ఇనుపరాడ్లతో కంచెనూ ఏర్పాటు చేశారు. సమీప ప్రాంతాల్లోని వ్యాపారవేత్తల ఆ స్థలంలో తమ కార్లు పార్కింగ్ చేయడానికి వీలుగా ఉంటుందని ఖాళీగా ఉంచారు. బస్టాండ్ సమీప ప్రాంతాల్లో పలువురు హోటల్స్‌తోపాటు పలు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వారి కార్లు వస్తే పార్కింగ్ చేయడానికి వీలుంటుందని ఖాళీ స్థలాన్ని కంచె ఏర్పాటు చేసి ఎవరూ స్కూటర్లు పార్కింగ్ చేయడానికి చేయడంపై పలువురు ద్విచక్ర వాహనదారులు మండిపడుతున్నారు. – తిరుపతి అర్బన్

బస్టాండ్ ముందు భాగంలో ఎడమ వైపు దారిలో స్కూటర్ల పార్కింగ్


- వ్యాపారుల కార్లకు 300 స్కూటర్ల పార్కింగ్‌కు సరిపడా స్థలం కేటాయింపు
- స్థలం లేక దారి మార్గంలో అడ్డదిడ్డంగా స్కూటర్లు పార్కింగ్
- పార్కింగ్‌కు నానా తిప్పలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు


వ్యాపారవేత్తల కార్లు కోసం కంచె ఏర్పాటు చేసి ఖాళీగా ఉంచిన స్థలం


బస్టాండ్ ముందు భాగంలో 3 మీటర్ల స్థలంలో స్కూటర్లు పార్కింగ్

అడ్డదిడ్డంగా స్కూటర్ల పార్కింగ్

బస్టాండ్‌కు దక్షిణం మార్గంలో నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు వచ్చి పోతుంటాయి. ఎడమవైపు మూడు మీటర్లు వెడల్పుతో దారి ఉంచారు. అలాగే బస్టాండ్‌కు వచ్చిన తర్వాత వాహనాలు వెళ్లడానికి కుడి వైపున మరో మూడు మీటర్ల దారి ఉంచారు. బస్టాండ్‌కు వచ్చిపోయే వాహనదారులు 10 నిమిషాల నుంచి 20 నిమిషాలు ఉండి తమ బంధువులు, స్నేహితులను బస్సు ఎక్కించి వెళ్లిపోతుంటారు. అయితే బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని వ్యాపారవేత్తల కార్లు కోసం ఉంచడంతో ద్విచక్రవాహనదారులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులతోపాటు ఇతర వాహనదారులకు బస్టాండ్ వద్దకు వెళ్లాలంటేనే తలనొప్పిగా మారుతోంది. వ్యాపారుల కార్ల కోసం ఉంచిన ఖాళీ స్థలాన్ని వదిలేస్తే 300 స్కూటర్ల వరకు పార్కింగ్ చేయడానికి వీలుంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉండవని పలువురు మొత్తుకుంటున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు ఆ పని చేయడం లేదు.


వ్యాపారవేత్తల కార్లు కోసం కంచె ఏర్పాటు చేసి ఖాళీగా ఉంచిన స్థలం

"కంచె తీసివేస్తాం



బస్టాండ్ ముందు భాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో స్కూటర్లు తాత్కాలికంగా పార్కింగ్ చేసుకోవడానికి వీలుగా ఉండడం కోసం కంచె తీసివేస్తాం. ఓ సారి ఉన్నతాధికారులతో మాట్లాడి తర్వాత నిర్ణయం తీసుకుంటాం. దారి మార్గంలో స్కూటర్లు పార్కింగ్ చేస్తే వచ్చిపోయే ప్రయాణికులకు, వాహనాలకు ఇబ్బందులు ఉంటాయి. బస్టాండ్ ముందు కంచె లోపలి భాగంలో ఉన్న ఖాళీ స్థలం వ్యాపారవేత్తల కార్లు పార్కింగ్ కోసం కేటాయించలేదు. బస్టాండ్ వద్ద ఖాళీ స్థలంలో వాహనదారులు ఎవరైనా తమ వాహనాలను తాత్కాలికంగా పార్కింగ్ చేయవచ్చు. ఎక్కువ సమయం చేయాలంటే అద్దె చెల్లించి ఆర్టీసీ పార్కింగ్ కేంద్రంలో పెట్టుకోవాలి.

– భాస్కర్‌రావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) తిరుపతి బస్టాండ్

ఆ వాచ్‌మెన్లను సస్పెండ్ చేయాలి

తిరుపతి రూరల్: మండలంలోని తాటితోపు వద్దనున్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ స్కూల్ వాచ్‌మెన్లు పిల్లల చేత మద్యం తెప్పించుకుని సేవిస్తున్నారని, వారిద్దరినీ తక్షణం సస్పెండ్ చేయాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు, రాయలసీమ అధ్యక్షుడు విజయ్, యూనివర్సిటీ నాయకులు బజారి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్‌ను వినియోగించుకోండి


హరిబాబు

తిరుపతి అర్బన్: నాలుగేళ్ల క్రితం తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌ను అంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్, డీఎం హరిబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 34 బ్యాచ్‌ల శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున 34 బ్యాచ్‌లో 544 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని వెల్లడించారు. ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో నామమాత్రపు ఫీజులు చెల్లించి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండడానికి వీలుందని వివరించారు. శుక్రవారం 35వ బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వడానికి స్వాగతం పలుకుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి 36వ బ్యాచ్‌కి దరఖాస్తులు అందిస్తామని తెలియజేశారు. లైసెన్స్ రెన్యూవల్ చేసుకునే వారు రూ.1180 చెల్లించాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 2268 మంది తమ లైసెన్స్‌ను అలిపిరి డిపో రెన్యూవల్ చేయించుకున్నారని వివరించారు.

పలకరింపులు.. పరామర్శలు


రాయలపురం సర్పంచ్ వెంకటయ్యను పరామర్శిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: మడలంలోని పలు కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరై పరామర్శించారు. గురువారం తొలుత గంగుడుపల్లెకు వెళ్లి వైఎస్ఆర్ సీపీ సానుభూతి పరుడు దేవేంద్రరెడ్డి పంది గుంట కొండమ్మల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం రాయలపురం పంచాయతీ సర్పంచ్ వెంకటయ్యను పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్చి అయి రావడంతో ఆయన్ను కలిశారు. అలాగే రాయలపురంలోని పలువురు వైఎస్ఆర్‌సీపీ సానుభూతి పరుల ఇళ్లకు వెళ్లి వారిని కూడా పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను సమష్టిగా పరిష్కరిస్తాం


ప్రెస్‌క్లబ్ శిలాఫలకం ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తామంతా సమష్టిగా కృషి చేస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. ఆధునికీకరించిన ప్రెస్‌క్లబ్ ప్రారంభోత్సవాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. తాను మీడియా సంస్థకు అధిపతిగా ఉంటూ ఈ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ 35 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి ప్రెస్‌క్లబ్కు ఇప్పటివరకు సొంత స్థలం అంటూ లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ప్రెస్‌క్లబ్‌కు సొంత స్థలం సమకూర్చేందుకు సీఎం అంగీకరించారన్నారు. త్వరలోనే ప్రెస్‌క్లబ్‌కు సొంత స్థలాన్ని సమకూరుస్తామని ఆయన చెప్పారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ కార్యవర్గం లావణ్య కుమార్, జగదీష్, విజయ్ యాదవ్, మాధవ్, నాగార్జున, కోటేశ్వరుడు, బాలయ్య, చంద్ర గౌడ్, పరంధామ రెడ్డి, శ్రీనివాసరావు, వరప్రసాదరావు, కో–ఆప్షన్ సభ్యులు పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగ దాతలుగా ఎదగాలి


సదస్సును ప్రారంభోత్సవం

తిరుపతి రూరల్: ప్రతి ఒక్కరూ కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా, తమ ప్రతిభ, సృజనాత్మకత ఆధారంగా వ్యాపారాలను ప్రారంభించి, మరెందరికో ఉద్యోగావకాశాలు కల్పించే దాతలుగా ఎదగాలని సెట్విన్ సీఈఓ కె.మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో స్టార్టప్ ఇండియా అంశంపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చన్నారు. తిరుపతి జిల్లాలోని పరిశ్రమలకు సంబంధించిన అవకాశాలు, పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలను ఎస్వీ యూనివర్సిటీ స్టార్టప్ సీఈఓ సి.వంశీకృష్ణ, బ్యాంకుల రాయితీలు, పూచీకత్తులేని రుణాలు, వాటిని పొందే విధానాలను ఎస్వీసీఈ కళాశాల ఆచార్యులు డాక్టర్ గౌతమి వివరించారు. సదస్సులో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ప్రతినిధి జ్ఞానశేఖర్ రెడ్డి, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం. మునిరత్నం, మై భారత్ ప్రాంతీయ గణాంక అధికారి ఎంసీ. బాబురెడ్డి, మై భారత్ సిబ్బంది నాగరాజ, కృష్ణవేణి పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆదేశాలతో మహిళా వర్సిటీ వేదికగా జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్ పోటీలో ఎస్వీయూ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. నెల్లూరు, తిరుపతి, వైఎస్ఆర్ జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇచ్చిన 10 క్వాంటం థీమ్‌ల మీద వినూత్న ఆలోచనలు ప్రదర్శించారు. ఇందులో సుమారు 50 బృందాలు పాల్గొనగా, ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలోని ఎంఎస్ డేటా సైన్స్ కోర్సు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య వెంకటేశ్వర్లు, హెచ్ఓడీ ఆచార్య అంజన్ బాబు, ఆచార్య పద్మావతమ్మ, డాక్టర్ రమేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాకర్స్‌కి అన్ని వసతులు కల్పించాలి


సమస్యలను కమిషనర్‌కు విన్నవిస్తున్న వాకర్స్

తిరుపతి తుడా: పద్మావతి పార్కులో వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ బాగు చేసి, జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం పద్మావతి పార్కు, పక్కనే ఉన్న మస్టర్ గదిని కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఆమె పరిశీలించారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. పార్కు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న షాపులు తొలగించాలని, మస్టర్ గది పక్కన ఉన్న మరుగుదొడ్లలో కుళాయిలు బాగు చేయించాలని, వాకింగ్ ట్రాక్ బాగు చేయించాలని వాకర్స్ కమిషనర్‌ను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మధు, డీఈలు మహేష్, శిల్ప, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు స్పందన


ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లె, కుప్పంబాదూరు పీహెచ్‌సీల్లో గురువారం తిరుపతికి చెందిన స్విమ్స్ బృందం నిర్వహించి ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు మంచి స్పందన లభించింది. తొలుత వైద్యులు డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి, డాక్టర్ పూర్ణ.. క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్ పరీక్షలతోపాటు బిపి, షుగరు తదితర పరీక్షలను పింక్ బస్సుల్లో నిర్వహించారు.

నేడు ఏచూరి వర్ధంతి సభ

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సీపీఎం పూర్వ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభకు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి ఆశించిన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సభకు కమ్యూనిస్టులు, లౌకిక వాదులు, సామ్యవాద అభిమానులు తప్పక హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు


ఎస్వీయూ ఎదుట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్

- ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- 80మంది యువత రక్తదానం
- భారీ ఎత్తున అన్నదానం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. రుయా ఆసుపత్రి అత్యవసర విభాగంలో హరిప్రసాద్‌రెడ్డితోపాటు 80 మందికి పైగా మిథున్‌రెడ్డి అభిమానులు రక్త దానం చేశారు. రేణిగుంట సమీపంలో అభయక్షేత్రంలో అన్నదానం చేశారు.

టీటీడీ ఆస్పత్రుల్లో స్వచ్ఛందంగా సేవలందించండి


మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఆధ్వర్యంలోని వివిధ ఆస్పత్రుల డైరెక్టర్లతో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి గురువారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రముఖ వైద్యులు టీటీడీ ఆస్పత్రుల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోగులకు వైద్య సేవలు అందించే అంశంపై అదనపు ఈఓ చర్చించారు. గతేడాది బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనల మేరకు శ్రీవారి సేవలో భాగంగా ప్రొఫెషనల్ సేవలను ప్రవేశ పెట్టాలనే టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా స్విమ్స్ డైరెక్టర్ డా.ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్ డా.జగదీశ్, ఎస్పీసీహెచ్‌సీ డైరెక్టర్ డా.శ్రీనాథ్ రెడ్డి, టీటీడీ సీఎంఓ డా.నర్మద, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి అధిపతి డా.రేణుదీక్షిత్‌తో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఈఓ మాట్లాడుతూ టీటీడీ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందించదలచిన వైద్యులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేందుకు వీలుగా ఓ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేయాలని జీఎంఐటీ ఇన్‌చార్జ్ ఫణికుమార్ నాయుడును ఆదేశించారు. సమావేశంలో చీఫ్ పీఆర్వో డా.రవి, అశ్విని ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డా.కుసుమ కుమారి, బర్డ్ మెడికల్ సూపరింటెండెంట్ డా.వెంకా రెడ్డి, స్విమ్స్‌కు చెందిన డా.ఆలోక్ సచన్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీలను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు మహతి కళాక్షేత్రంలో అత్యంత వేడుకగా నిర్వహించే జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలను జయప్రదం చేయాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన రంగస్థలి జాతీయ స్థాయి నృత్య పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభమై రాత్రి 9.30 గంటల వరకు సాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి ,కార్యదర్శి కేఎస్.రాజా, సురేష్ స్వామి, విజయభాస్కర్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని భార్యకు నగదు ఇస్తున్న గౌడ సంఘ సభ్యులు

పాకాల: మండలంలోని చిగరపల్లెలో ఈడిగ గౌడ సంఘం సభ్యుడు కె.సుబ్రమణ్యం(48) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. గురువారం ఈడిగ గౌడ సంఘం సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని భార్య కె.గీతకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, గోపిగౌడ్, కుమార్‌గౌడ్, మునిరత్నం గౌడ్, వెంకటేష్‌గౌడ్, చెంగలరాయులుగౌడ్, హేమంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీలో చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి హుండీలో సొమ్మును అపహరించిన కేసులో తమిళనాడు, తిరునల్వేలి జిల్లా, శంకరన్ కోవిల్ గ్రామానికి చెందిన వేణువనలింగానికి 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.కోటేశ్వరరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 10వ తేదీ శ్రీవారి ఆలయంలోని బంగారు బావి పక్కన ఉన్న స్టీల్ హుండీలో నిందితుడు వనలింగం రూ.4900 అపహరించాడు. సీసీటీవీ సిబ్బంది చోరీని గమనించి విజిలెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విజిలెన్స్ సిబ్బంది నిందితుడు వేణు వనలింగంను అదుపులోకి తీసుకుని అతనిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి గురువారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు వేణు వనలింగం ఇదివరలో శ్రీవారి ఆలయంలోని హుండీలలో చోరీలకు పాల్పడినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.